# 179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

## చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెకార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

### వేలం వేసిన ఖనిజాల వివరాలు

| ఖనిజం | వేలం వేసిన బ్లాకులు | టెక్నికల్ బిడ్ల సంఖ్య | రిజర్వు ధర (రూ.) | తుది బిడ్ మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| కలర్ గ్రానైట్ | 1 | 5 | 29,04,000 | 4,99,79,000 |
| లాటరైట్ | 4 | 39 | 63,33,600 | 15,89,58,600 |
| స్టోన్ అండ్ మెటల్ | 14 | 84 | 4,71,25,000 | 35,84,75,000 |
| మొత్తం | 19 | 128 | 5,63,62,600 | 56,74,12,600 |

# గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

# పారిశ్రామికానికి బీటలు

## ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి



- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి

నూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే డీలాపడింది. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతోపాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది.

ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

### డీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

### క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్వాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్స్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.

### కీలక రంగాలది అదే దారి


కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.



| | ఏప్రిల్-2025 | ఏప్రిల్-2024 |
|---|---|---|
| పారిశ్రామిక ప్రగతి | 2.7% | 5.2% |
| తయారీరంగ వృద్ధి | 3.4% | 4.2% |
| గనుల రంగ వృద్ధి | -0.2% | 6.8% |
| విద్యుత్ రంగం | 1% | 10.2% |
| ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం | 4% | 8.5% |
| ప్రాథమిక వస్తువుల అవుట్‌పుట్ | -0.4% | 7% |

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకానుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్‌ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదంతొక్కాయి. బ్రిటిష్ మల్టీనేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్‌ఇండ్, నెస్లె, అల్ట్రాటెక్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్‌ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్స్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.



# డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాముపొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంద్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.


# ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

## 2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం





న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.



### ఎంఎస్‌ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.



సీపీఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

# కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద ధారపోస్తున్న మోదీ

- మతోన్మాద సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మరో రూపం బీజేపీ
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు కొనసాగిస్తున్నం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

తెలంగాణచౌక్, మే 28: దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ప్రధాని నరేంద్ర మోదీ ధారపోస్తున్నడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. నగరంలోని మధు గార్డెన్‌లో రెండు రోజుల నిర్వహిస్తున్న ఆ పార్టీ జిల్లా మహాసభ బుధవారం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన విధానంతో పాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. మతోన్మాద సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మరో రూపం బీజేపీ అని దుయ్యబట్టారు. ప్రపంచంలో దేశం ఆర్థికంగా మూడో స్థానంలో ఉందని చెబుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, దేశంలో పేదరికం ఎందుకు ఉందో సమాధానం చెప్పాలన్నారు. రంగుల ప్రపంచంలో దేశాన్ని నడిపిస్తూ తన అనుకూల కార్పొరేట్ శక్తులకు ఆదాయాన్ని పెంచేలా చట్టాలు సవరిస్తున్నడని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ, పేదలకు పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, కల్యాణ లక్ష్మి లాంటి పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హామీల విషయంలో ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, నాయకులు కేదారి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'డీఈవో జనార్ధన్ రావు సరెండర్ హర్షణీయం'

కార్పొరేషన్, మే 28: అనుచిత వ్యాఖ్యలతో జిల్లా ఉపాధ్యాయులను వేదనకు గురి చేసిన డీఈవో జనార్ధన్ రావును రాష్ట్ర విద్యాశాఖకు సరెండర్ చేయడం హర్షణీయమని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి అన్నారు. కలెక్టర్ చర్యను డీటీఎఫ్ తరపున స్వాగతిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం డీటీఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఈవో గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తన స్వీయ మానసిక ధోరణితో ఇష్టారాజ్యంగా కార్యాలయాన్ని నిర్వహించారని విమర్శించారు. సున్నితమైన విద్యా రంగ నిర్వహణ, పర్యవేక్షణ పద్ధతులను కాలరాసి, అసంబద్ధ, అప్రజాస్వామిక భాషను వాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రశ్నల రూపంలో వేధించేవారని ఆరోపించారు. ఆయన వైఖరిపై మొదటి నుంచి డీటీఎఫ్ అనేక ఉద్యమాలు, ధర్నా నిర్వహించిందన్నారు. డీఈవోపై చర్యల్లో భాగంగా తక్షణమే సస్పెండ్ చేయాలని, భవిష్యత్తులో ఏ జిల్లాకు కూడా డీఈవోగా నియామకం చేయవద్దని డిమాండ్ చేశారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రాంమోహన్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘుశంకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఆడిట్ కమిటీ కన్వీనర్ శంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ పనులు ప్రారంభం

మెట్‌పల్లి, మే 28: కథలాపూర్ మండలం పోసానిపేట, సిరికొండ గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను బుధవారం ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ డీఈ గోపీకృష్ణ ప్రారంభించారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు ప్రభుత్వం రూ. 2020 కోట్లు మంజూరి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ కన్‌స్ట్రక్షన్ రాజబ్రహ్మాచారి, ట్రాన్స్‌కో కోరుట్ల, మెట్‌పల్లి ఏడీఈలు రఘుపతి, మనోహర్, ఏఈలు దివాకర్ రావు, భూమేశ్వర్, మునీంధర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ కందరి జీవన్‌రెడ్డి, డైరెక్టర్‌లు ఎండీ హఫీజ్, కిషన్‌రెడ్డి, భూమారెడ్డి, రాజు, నర్సయ్యా, గంగనర్సయ్యా, రవి తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పోస్ట్ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



ఆర్నకొండ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న సీపీ గౌష్ ఆలం

- పశువుల అక్రమ రవాణా జరుగకుండా చూడాలి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం
- ఆర్నకొండ చెక్ పోస్ట్ తనిఖీ

చొప్పదండి, మే 28: పశువుల అక్రమ రవాణా జరుగకుండా పోలీస్ చెక్ పోస్టులో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశించారు. బుధవారం రాత్రి ఆయన చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్నకొండ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి గూడ్స్ వెహికల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. విధులు నిర్వర్తించేటప్పుడు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ మామిడాల సురేందర్, ప్రొబేషనరీ ఎస్ఐ మనీషా, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులను అక్రమ తరలిస్తే చర్యలు

రాయికల్, మే 28: పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధీర్ రావు హెచ్చరించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా సరిహద్దు బోర్నపల్లి గ్రామంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నిత్యం చెక్ పోస్ట్ వద్ద పశువైద్యాధికారుల పర్యవేక్షణలో 24 గంటలు పోలీసులు నిఘా పెడుతూ పశువుల అక్రమ రవాణాను అరికడుతారని తెలిపారు. ఎవరైనా పశువులను అక్రమ రవాణా చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కొడిమ్యాల, మే 28: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు, ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్‌లో ఇసుక డంపు సీజ్

మెట్‌పల్లి రూరల్, మే 28: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూర్‌లో తనిఖీలు చేపట్టగా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు వంద ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక నిల్వలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

## గంజాయి పట్టివేత

సారంగాపూర్, మే 28: మండలంలోని బట్టపల్లి ఎక్స్ రోడ్ వద్ద బుధవారం గంజాయి తరలిస్తున్న జగిత్యాల రూరల్ మండలం తారక రామనగర్‌కు చెందిన షేక్ రఫీక్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తారక రామనగర్‌కు చెందిన షేక్ రఫీక్ బుధవారం ఆదిలాబాద్ జిల్లా కంబుగూడ గ్రామానికి చెందిన మార్వతి కాకా వద్ద 1035 గ్రాములు గంజాయి కొనుగోలు చేశాడు. తిరిగి జగిత్యాలకు వస్తుండగా బట్టపల్లి ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న గంజాయి, మోటర్ సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం, మే 28: గంజాయి విక్రేతను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనిల్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ క్రాస్ రోడ్డు వద్ద సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన బోదాసు రాము అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు. అతడి చేతిలో ఉన్న సంచిని తనిఖీ చేయగా 120 గ్రాముల గంజాయి దొరికినట్లు పేర్కొన్నారు. గంజాయి స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వచ్చిందే ఆలస్యం.. అవీ పుచ్చులే..!

- నాణ్యత లేని జీలుగ విత్తనాలు



శంకరపట్నం మండలం రాజాపూర్‌లో రైతులకు వచ్చిన పుచ్చిపోయి ఉన్న జీలుగ విత్తనాలు

శంకరపట్నం, మే 28 : జీలుగ విత్తనాలు అసలే నెల రోజులు ఆలస్యంగా రాగా, అవి కూడా పుచ్చులే రావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని జీలుగ విత్తనాలు రావడంతో మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని గద్దపాక సింగిల్ విండో కార్యాలయానికి 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేశారు. అయితే, బుధవారం రాజాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి ప్రభాకర్, పెసరి మల్లేశ్, చింతిరెడ్డి రాజిరెడ్డి, రెడ్డి సమ్మయ్యా, తదితరులు తమకు వచ్చిన జీలుగ విత్తన బ్యాగులు తెరిచి చూడగా మొత్తం పుచ్చిపోయి ఉన్నాయి. మొలకెత్తడానికి పనికి రానివి సరఫరా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దపాక సింగిల్ విండో ద్వారా సరఫరా చేసిన మొత్తం విత్తనాలు ఇలాగే ఉన్నాయని వాపోయారు. కాగా, కొందరు రైతుల ఆరోపణల మేరకు శాంపిల్స్ సేకరించి తెలంగాణ సీడ్ కార్పొరేషన్‌కు పంపించినట్లు ఏఈ వెంకటేశ్ వివరణ ఇచ్చారు. ల్యాబ్‌లో పరీక్షల అనంతరం విత్తనాలలో నాణ్యతా లోపం ఉన్నట్లు తేలితే తిరిగి ఇతర నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తామని, లేదా తిరిగి రైతుల డబ్బులు చెల్లించనున్నట్లు వెల్లడించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జగిత్యాల రూరల్, మే 28: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవో జారీ చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ జీవో జారీ చేయకుంటే వెయ్యి మంది బీసీ నేతలతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు ఎలుక భగవాన్, కొక్కు గంగాధర్, తిరుపురం రాంచంద్రం, రాచకొండ రోజా, రాపర్తి రవి, బొమ్మిడి నరేశ్, సంజయ్, సామ్రాట్, వంశీ, మల్లీశ్వరి, హృషికేష్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల

కార్పొరేషన్, మే 28: నగరంలోని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ అటానమస్ కళాశాల పీజీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.సురేశ్‌కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాలలో నిర్వహిస్తున్న 11 పీజీ కోర్సుల ఫలితాలను విడుదల చేశామని తెలిపారు. పీజీ మొదటి సెమిస్టర్‌లో 261 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 87 శాతం ఉత్తీర్ణతతో 226 మంది విద్యార్థులు, మూడో సెమిస్టర్‌లో 242 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 92 శాతంతో 222 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. పీజీ విద్యార్థులు exambranch.com వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు టి.కరుణాకర్, డాక్టర్ ఎం.మల్లారెడ్డి, అకాడమిక్ సమన్వయకర్తలు టి.రాజయ్యా, శంకరయ్యా, కట్టా వేణు, వంగల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

జగిత్యాల, మే 28: జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 25, 26వ వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్క అధికారి, నాయకులు, ప్రజలు బాధ్యతతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్లు అడువాల జ్యోతి-లక్ష్మణ్, గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

జగిత్యాల రూరల్, మే 28: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. కాగా, బుధవారం రెండో రోజు డీఎస్పీ రఘుచందర్ హాజరై పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. మత్తుపదార్థాల బారిన పడకుండా విద్యార్థులకు సరైన మార్గనిర్దేశనం చేయాలన్నారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ, సైబర్ నేరాలకు సంబంధించిన విషయాలపై ఉపాధ్యాయులకు లోతైన అవగాహన కల్పించాలని రిసోర్స్ పర్సన్లకు సూచించారు.